

ఈ విధంగా అరున్నరనుండీ ఏడున్నరవరకూ అప్పారావు చేసిన ఋణప్రసంగంలో, చెత్తా చెదారం వేరుచేసి దాన్నే పోగేసి చూసుకొనే సరికి గుర్నాధం గుండె గంటన్నర సేపులోను రెండోసారి గుభేలు మంది.

భానుమతిరా! ఆ పిల్లనుతప్ప ఇంకోళ్ళని చచ్చినా చేసుకోను. రామయ్యగారి ట్వంటీ యాకర్సు పొలంవద్దు. వాళ్ళ అన్నపూర్ణ అంతకన్నా వద్దు. చచ్చేనా పోతాను గాని, చచ్చినా చేసుకోను అన్నాడు గుర్నాధం.

రామయ్యగారిని గనక నువ్వు అవమానిస్తే మీ నాన్న తక్షణం టెలిగ్రాం మీద నీ డొక్కచింపించి డోలు కట్టించి దానిమీదే తండ్రి మాట వినని పుత్రుడి గాథ ఏమైనదో టముకు వేయించేస్తాడు. మిగతా డొక్కతోటే డోళ్ళు, బుర్రలు చేయించి, బుర్రకథలు చెప్పిస్తాడు అన్నాడు అప్పారావు.

చెయ్యనీ చూద్దాం.

చూదాం కాదు...విందామను. వినడానికక్కడా నువ్వుండవుగా.

ఛప్ నోర్మూయ్. హిస్టరీ లెక్చరర్లా చవటవిట్లూ నువ్వూను. వేసినవే వేస్తూ నవ్వడానికి విసుగులేదూ?

హిస్టరీ లెక్చరరు విట్టు నేనెప్పుడూ రెండోసారి వినలేదుగా నీలాగా. హిస్టరీ లెక్చరరు విట్టుకన్నా చాలా బావుండని 'విట్టు' – మీ కాబోయే మామయ్య రామయ్యగారు రేపు తెల్లారి ఎనిమిది గడియలకు రెండోసారి నీకు తటస్థపడతారు. అది చూడు ముందర అన్నాడు అప్పారావు.

గుర్నాధం తలవంచుకున్నాడు మాటాడకుండా. అతనికేం పాలుపోలేదు. వాళ్ళ నాన్న పంపిన అన్నపూర్ణ ఫోటోవంక చూస్తూ దిగాలు పడిపోయాడు.

అప్పారావు తేలుకుట్టినట్లు కిటికీదాకా వెళ్ళి మళ్ళీ వచ్చి, పద, విచారించకు, సినిమాకి పోదాం అన్నాడు.

ఈ సారి నిజంగా డబ్బుందిలే. హోలు దగ్గిర అప్పు చెయ్యను అని ధైర్యం చెప్పాడు.

ఎక్కడిది ఆయన ఇచ్చిందేనా? అన్నాడు గుర్నాధం ఆ బాధలోనే.

కాదు, ఇప్పుడు వరండాలో రాజు పోతుంటే కిటికీలోంచి అడిగాను. మారు మాటాడకుండా ఇచ్చాడు. ఎలాగేనా చాలా పెద్దమనిషి అనుకో, నువ్వు వెయ్యిచెప్పు...ఛీ ఛీ అదేమిట్రా హీరోయినులా అలా...తప్పు. సిల్లీ. ఏమిటి సంగతి. వాటీజ్ రాంగ్? అరే!

గుర్నాధం కళ్ళు వత్తుకున్నాడు. మా నాన్న మనియార్డరు పంపగానే నీకు పదిరూపాయలు అప్పిస్తాగాని, సమస్య చూడరా. ఈ పెళ్ళి జరిగితే, నేను చచ్చిపోతాను. జరక్కపోతే మా నాన్న చంపేస్తాడు...ఎలాగ.

అప్పారావు జాలిపడ్డాడు....పుట్టుట గిట్టుట కొరకే అనకూడదనుకో ఇపుడు. అయినా అంత భయమేమిటి. రామయ్యగారు రేపు నిన్ను చూడగానే భేష్ అనేస్తాడే అనుకుందాం. ఆయన అభిరుచిమీద నాకు గురిలేదు – అప్పులు బాగా ఇచ్చినాసరే. ఆ అమ్మాయి అన్నపూర్ణ ఒప్పుకోవద్దూ? కోడిలా చూపులూ, బోడి షోకూ వీడూ నాకేం బావులేదు నాన్నా అనేస్తే? అన్నాడు.

అలా అనకురా, నన్ను చేసుకోకపోతే ఇంచుమించు చచ్చిపోతానన్నట్టే మాటాడింది టామ్మాయి.

ఇద్దరూ మాటాడలేదు.

పోనీ ఓ పనిచేస్తే...అన్నాడు గుర్నాధం. ఈయన కాళ్ళమీద ఎలాగా పడదామనుకున్నాం కాబట్టి రేపొద్దున్న రాగానే ఆ పనిచేసి అయ్యా! ఇలా నేను ఫలానా పిల్లని చేసుకోవాలనుకుంటున్నాను, నా మీద దయయుంచి మీ అమ్మాయితో పెళ్ళి తప్పేందుకు మీరే ట్రిక్కు చెబుదురూ అని రహస్యంగా అడిగితే?

అప్పారావు జాలిగా నవ్వాడు. ఆయనకి నువ్వు చెబుతున్న ఫలానా అమ్మాయి భానుమతి మీద ఏమాత్రం మంచి అభిప్రాయం ఉన్నట్లు లేదు, నవ్వేస్తాడు, తాడేమిటి! నవ్వేశాడు కూడా అన్నాడు అప్పారావు.

గుర్నాధం ఉలిక్కిపడ్డాడు. అదేమిటి! భానుమతి ఆయనకు తెలుసా? అన్నాడు.

భానుమతిని అప్పారావే ఆయనకు పరిచయం చేశాడుట.

ఏం చెయ్యను! ఇందాక హోలుదగ్గర నువ్వు పారిపోయాక ఆయన నన్ను పిచ్చివాడని పోలీసుకి ఒప్పచెప్పబోయి, నా ఇంగ్లీషూ అదీ విని దంగైపోయి నాలిక్కరుచుకున్నాడు. సారీ అన్నాడు. తరవాత కాఫీ తాగాం. తరవాత నా సంగతి అడిగి నీ పేరెత్తి నీ ఎడ్రసు అడిగాడు. నువ్వు తెలుసునని చెప్పి, ఎందుకని అడగడం మర్చిపోయి మన కథ చెప్పాను.

భానుమతి ముక్కు కొంతదూరం వచ్చి గబుక్కున పైకి తిరుగుతుందన్నాను. నవ్వాడు...వాళ్ళింట్లో వాళ్ళు భానుమతి ఉందిగదా అని ఇంటికి దీపాలు పెట్టించుకోలే దన్నాను...నవ్వాడు...భానుమతి నడుము ఉందని కొందరూ, లేదని కొందరూ పందాలు వేసుకున్నారనీ, ఉందన్న వాళ్ళు ఓడిపోయారనీ చెప్పాను. అబ్బా అన్నాడు...నవ్వి, నువు నవల్సులు రాయకూడదోయ్. అవునుకాని, గుర్నాధం ఎడ్రసేమిటన్నావూ.

బుద్ధిమంతుడేనా? అతనున్నాడని హాస్టల్లో దీపాలు మానేశారా? ఇలా మా పిల్ల నిద్దామనుకుంటున్నాం. పిల్ల చిదిమి దీపం పెట్టినట్టుంటుంది. రేపొద్దున్నొచ్చి అబ్బాయిని చూసి, అతను ఔనంటే- ఈ పాటికి మా పూర్ణమ్మ ఫోటో అందేవుండాలి, ఊరికెళ్తూనే తాంబూలాలిచ్చుకోడమేనూ అన్నాడు, అన్నాడు అప్పారావు.

గుర్నాధం దిగులు పడిపోయాడు ఏందారి? అన్నాడు.

ఏం దారి చెప్మా అని అప్పారావు ఆలోచించబోయాడు.

ఆల్ రైట్ గుర్నాధం, అన్నపూర్ణతో పెళ్ళి తప్పే మార్గం ఆలోచిస్తానుగాని నువ్వు ఇందాక మాటిచ్చావుచూడు... ఏది మీనాన్న మనియార్డరు పంపగానే పదిహేను అప్పిస్తానన్నావే, ఆ ఇరవయి గనక ఇప్పుడెక్కడైనా ఏడ్వాన్సుగా అప్పుతెచ్చి ఇచ్చావో, నాకు బుర్ర అమోఘంగా పనిచేస్తుంది. తెల్లారేసరికి ఫస్టుక్లాసు అయిడియా పుడుతుంది. నేను మళ్ళీ నీ పాతిక నీకు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను, డబ్బు రాగానే. ఏమంటావు? సయ్యేనా? బాగా ఆలోచించుకో ముఫ్ఫై రూపాయల అప్పుతో నీ జీవితం అంతా బ్రెమ్హాండంగా అయిపోయే అయిడియా ఇస్తాను చెప్పు సరేనా? అన్నాడు.

గుర్నాధం గబుక్కున తలవంచుకుని మళ్ళీ మెల్లిగా బాధగా దేవదాసులా తలెత్తి చూశాడు. అబ్బే నువ్వలా రేటు పెంచకుండా ఉంటే పది కాదు, ఐదు రూపాయలేనా సరే ఇస్తాను అన్నాడు.

నా జోకు పక్క నీ జోకు డోకులా వుంది. సర్లే పడుకొని నిద్రపో. రేప్పొద్దున్న అన్నపూర్ణతో పెళ్ళి తప్పినందుకు ఓ గ్లాడ్ సాంగూ ఎల్లుండి భానుమతిని చేసుకోగల ఛాన్సు పేరు చెప్పి ఒక యుగళగీతం, అసలు ఎవరో ఒకర్ని పెళ్ళి అంటూ చేసుకోవలసి వస్తున్నందుకు ఓ బ్రెహ్మాండమైన శాడ్ సాంగూ పాడుకుంటూ నిద్దరపో, ఈలోగా పాట మధ్యన ఆర్కెస్ట్రా వచ్చినపుడు చక్కగా నువ్వు నాకు బాకీ ఉన్న యాభై రూపాయల అప్పుగురించీ జ్ఞాపకం చేసుకుంటూ ఉండు, ఎక్కడలేని దిగుళ్ళూ పోతాయి అంటూ అప్పారావు అక్కడనుండి వెళ్ళిపోయాడు.

గుర్నాధం భానుమతితో ఆలోచనలు అరంభించడంతో అవి అక్కడే ఆగిపోయాయి. కాస్సేపటికే, అన్నపూర్ణ అనే పెళ్ళికూతురు బొమ్మ. దాన్ని బలవంతాన తనకి కట్టబెట్టడానికి రేప్పొద్దున్న వాళ్ళ నాన్న వేషంలో వస్తున్న రాక్షసుడు రామయ్యగారు గుర్తుకొచ్చి, ఈ పెళ్ళి కాదంటే తన తండ్రికి రాగల కోపం గుర్తుకొచ్చి. అతనికి ప్రాణం బెంబేలెత్తిపోయింది.

ఇహ నిహలోకంలో ఉండి లాభం లేదని, సుబ్బరంగా చచ్చిపోతే స్వర్గంనుండి భానుమతిని, ఆమె కాబోయే భర్తను దీవించి నీవైనా సుఖపడుమా అని తను ఏడుస్తూ పాడడం మంచిదని నిశ్చయించుకున్నాడు. ఈ విధంగా తను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు వాళ్ల నాన్నగారికీ, సంఘానికీ, ప్రపంచానికీ, పోలీసు కమీషనరుకీ నాలుగు పొడుగుపాటి ఉత్తరాలు మొదలుపెట్టి, ఒకటోది సగం రాసేసరికి సూయిసైడుకి స్పెల్లింగు కుదరక, కుదిరింది నచ్చక, నచ్చింది రాస్తే నాన్న తిడతాడనీ, తిట్టి మనియార్డరు పంపడనీ అనుమానం వేసి, ఆ సమస్యలో కొట్టుకులాడి నిద్రలో మునిగిపోయాడు.

పొద్దున్న ఎనిమిదిన్నరకి తెల్లవారింది. లైసెన్సున్నవాళ్లూ మొండివాళ్లూ ఒకటి తిన్నా పది తన్నగల జబ్బపుష్టిగలవాళ్లూ రొటీను సినిమా పాటలు పాడుతున్నారు. లేనివాళ్లు ఈలలేస్తున్నారు. అదిరానివాళ్లు వింటూ విసుక్కొంటున్నారు.

కొందరు నిన్న సాయంత్రందాకా వదలకుండా అప్పులవాడిలా తగులుకున్న పాటను పరాగ్గా ఉండగా విప్పి పారేసి, కొత్తపాట తొడుక్కుంటున్నారు. కొందరు బద్ధక యోగాసనాలు వేస్తున్నారు. మిగతావాళ్లు అద్దంలో సౌందర్యారాధన చేస్తున్నారు. రాగాలేవీ రానివాళ్లూ, దేవదాసులూ, తదితర భగ్న ప్రేమికులూ, పిరికివాళ్లూ, ఫస్టుమార్కులు, మెడల్సుకోరే దురాశాపరులూ, చదివితేనే పాసవుతామని పొరబడే అమాయకులూ, ఏమీ తోచనివాళ్లూ, ఈ క్లాసు పుస్తకాల్లో అసలేం రాస్తారో ఓసారి చూదాం అని కుతూహలం గలవారూ, రెండుజడల సీతలు అడిగితే ఇచ్చేందుకు నోట్సులు రెడీగా ఉంచాలనుకునేవారూ పుస్తకాలు తీసి చదువుకుంటున్నారు. అప్పారావు చురుగ్గా ఏ జేబులో ఏ అప్పుందోనని అందర్నీ అడిగి అందినంతవరకు అప్పులు చేస్తున్నాడు. అందులోనే కొంత తీరుస్తున్నాడు – మన సామ్మెం పోయిందని.

★ ★ ★